పర్వతాలు పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. కుక్కి మంచంపై కాటికి కాళ్లు చాపుకొని ఉన్నవానిలా పడుకొని ఉన్నాడు. చిక్కి శల్యమై ఎముకల గూడులా ఉన్నాడు. వీళ్లిద్దరూ చెరోపక్క పట్టుకొని లేపితేకానీ, మంచంపైనుంచి లేవలేక పోయాడు.

జీవంలేని కళ్లతో గోవిందం వంక ప్రశ్నార్థకంగా చూశాడు. ఆచారి పరిచయం చేస్తే.. ఆ కళ్లు కాస్త వెలిగాయి. తన చేతులతో గోవిందం చేతులను పట్టుకొని ఊపుతూ.. తన సంతోషాన్ని వ్యక్తపరిచాడు. గోవిందం అతణ్ని మధ్యాహ్న భోజనానికి ఆహ్వానించాడు.

''నాకు వత్తమనే ఉంది. కానీ, చాతకాదు కద!'' నూతిలోంచి వస్తున్నట్లు.. బలహీనంగా ఉన్న స్వరంలో అంతులేని నిరాశ కూడా ధ్వనించింది.

''ఆటో పంపిస్తంలే! తప్పక రా'' అన్నాడు ఆచారి.

''అట్లయితే తప్పక వొస్త''.. అతని మొహంలో ఇప్పుడు కొంత వెలుగు కనిపించింది వారికి.

మరో అరగంటలో మిగతా అందరికీ చెప్పి ఇల్లు చేరుకున్నారు. ఆటోలో తీసుకురాదగిన వారు ముగ్గురున్నారు. భోజనంతోపాటు ఆటో ఏర్పాటు కూడా చేస్తానని ఆచారి వెళ్లిపోయాడు.

* * *

మధ్యాహ్నం ఒంటి గంట అవుతుండగా.. ఒక్కరొక్కరూ రావడం మొదలుపెట్టారు. ఆటోలో వచ్చేవారు కూడా వచ్చారు. మరో అరగంటలో గోపాల్ రెడ్డితో పాటు అందరూ వచ్చేశారు. ఆ సమయానికే ఆచారి అదే ఆటోలో భోజన పాత్రలు తీసుకొచ్చాడు.

గోవిందం ఇంటి వాకిలంతా కోలాహలంగా తయారైంది. వృద్ధులైన వారందరూ చిన్నపిల్లల్లా మారిపోయి.. అల్లరి అల్లరిగా కబుర్లు చెప్పుకొంటున్నారు. పరిహాసాలాడుకుంటూ పగలబడి నవ్వుతున్నారు. తమ కష్టాలన్నీ మరచిపోయినట్లుగా కేరింతలు కొడుతున్నారు. అందరిలోనూ ఉత్సాహం ఉల్లాసం!!

ఉదయం తను చూసిన దయనీయ స్థితిలోని వారేనా వీరు? అని ఆశ్చర్యపోతూ ఆనందపడ్డాడు గోవిందం. ఆచారి సైగ చేయగానే లేచి ఒక్కొక్కరి దగ్గరికి వెళ్తూ..

''ఇక లేవండి! భోంచేసిన తరువాత తీరిగ్గా కూసొని మాట్లాడుకుందాం'' అన్నాడు.

గోవిందం, ఆచారి ఇద్దరూ అందరి ప్లేట్లలో వడ్డిస్తున్నారు. బగారా అన్నం, తెల్లన్నం, చికెన్ కూర, గుడ్ల పులుసు, పప్పు, ఆలుగడ్డ కూర, చారు, పెరుగు అన్నీ సిద్ధం చేశాడు ఆచారి.

''ఈ పల్లెటూర్లో.. ఇంత తక్కువ టైంలో ఇన్ని ఐటమ్స్‌తో ఇంత మంచి విందు భోజనం చేయిస్తవనుకోలేదు. నీవు గ్రేట్‌రా! అట్లనే థాంక్స్ కూడా!''.. ఆచారిని హృదయపూర్వకంగా మెచ్చుకున్నాడు గోవిందం.

''వంటంతా నా భార్య చేసిందిరా. సామానంతా ఈ ఆటో రాజుతో తెప్పించిన. నాదేం లేదు!'' నవ్వుతూ అన్నాడతను.

అన్నం తిన్న తరువాత అరటిపండు, మైసూర్‌పాక్ కూడా పెడుతుండటంతో.. గోపాల్ రెడ్డి ఆగలేక, గోవిందం దగ్గరికెళ్లి..

''గోవిందూ! నిన్నెట్ల మెచ్చుకోవాల్నో సమజైతలేదు కానీ, అన్నీ చాలా బాగున్నయి. చాలా దినాల తరువాత మంచి భోజనం తిన్న!'' అన్నడు.

అవునన్నట్లుగా అందరూ తలలూపి ఒప్పుకొన్నారు.

భోజనాల తర్వాత అందరూ కబుర్లలో పడిపోయారు. మరో గంట తరువాత అందరికీ కూల్‌డ్రింక్స్ తెప్పించి.. గ్లాసుల్లో పోసి ఇచ్చారు.

''గోవిందూ.. నీకు చేతులెత్తి మొక్కాలిరా! ఇంతకు ముందెన్నడూ మేమంత ఇట్ల కలుసుకున్నది లేదు. ఇంత సంతోషంగా గడిపింది లేదు. మమ్ముల్ని మా పిల్లలు కడుపు నిండ తిండి పెట్టకుండ.. మాడ్చి సంపుతున్నరు. కుక్క బతుకైందిరా మాది!'' అన్నాడొకతను.

''అవున్రా! ఆసరా పింఛను రెండు వేలొస్తున్నయని మమ్ముల్ని ఇంట్లుంచుకొని.. గింత గంజి పోస్తున్నరు. కానీ ఓ మంచిమాట లేదు. రోగమొస్తే పలకరించే దిక్కు లేదు!'' అన్నాడు మరొకతను.

''నా ముందల్నే మంచిగ చేసుకొని తింటరు. నాకేమో సద్దికూడు పెడ్తరు. చికెనూ మటనూ తెచ్చుకుంటరు. నాకూ నా భార్యకు గింత సోర్వనన్న పెట్టరు. రాత్రి మిగిలిందే.. పెడ్తరు!''.. దాదాపు ఏడ్చినట్లుగా అన్నాడు పర్వతాలు.

''పొద్దుగాల తింటే రాత్రి దాక ఎదురు సూడాలె! ఒక్కోసారి ఆకలికి కడుపుల నొప్పి!''..

వెక్కి వెక్కి ఏడవసాగాడు మరొకతను.

''ఊర్కో.. ఏడ్వకురా!'' అంటూ అతణ్ని ఊరడించడానికి ప్రయత్నిస్తూ.. ఇంకొకరు కన్నీళ్లు పెట్టుకున్నాడు.

అందరికి కూడా దుఃఖం వచ్చి, చిన్నగానో, మౌనంగానో రోదించారు కొద్దిసేపు. గోవిందానికి కూడా గుండెల్లోంచి దుఃఖం తన్నుకొచ్చింది.. వాళ్ల దీనగాథలు వింటుంటే. వారితో పోల్చుకుంటే తనంత అదృష్టవంతుడు వీళ్లందరిలో లేడు.

మరో గంటకు అందరికీ టీలు తెప్పించాడు.

టీలు తాగి విచారం నుంచి తేరుకున్నారు. అనంతరం అందరూ పరస్పరం వీడ్కోలు చెప్పుకొని.. కృతజ్ఞతగా గోవిందాన్ని ఆలింగనం చేసుకొని ఆనందంగా వెళ్లిపోయారు

* * *

ఆ రాత్రి పడుకున్నాడే కానీ నిద్రరావడం లేదు గోవిందానికి. మనసంతా అల్లకల్లోలంగా తయారైంది. తన బాల్యస్నేహితుల విషాద గాథలే చెవుల్లో గింగురు మంటున్నాయి. ఈ వృద్ధాప్యంలో అందరి కష్టాల కడగండ్లలో సారూప్యం గురించి ఆలోచిస్తుంటే.. అతనికి మూడు సమస్యలు ప్రధానంగా తోచాయి.

మొదటిది ఆకలి. వాళ్లకు సరైన సమయానికి సరైన ఆహారం కడుపునిండా లభించడం లేదు. రెండవది అనారోగ్యం. సరైన వైద్య సహాయమూ, మందులూ లేవు. మూడవది నిరాదరణ లేదా తిరస్కారం. కుటుంబ సభ్యులెవరూ వారిని పట్టించుకోవడం లేదు. పైగా హీనంగా చూస్తున్నారు.

వారు ఒక్కపూటైనా నలుగురితో కలిసి కడుపునిండా భోజనం చేస్తే, ఆరోగ్యం కొంత మెరుగుపడవచ్చు. నిరాదరణ వల్ల కలిగిన నైరాశ్యాన్ని అధిగమించవచ్చు.

ఈ ఆలోచనలతో అతను మథనపడగా.. ఓ పరిష్కారం తోచింది. ఉదయమే లేచి ఆచారి ఇంటికి వెళ్లాడు. ఆచారి, అతని భార్యతో.. తన ఆలోచనను పంచుకున్నాడు. తన పరిష్కారంలోని సాధక బాధకాలను చర్చించాడు. వాళ్లిద్దరూ సహకరిస్తే.. తను ఇవ్వబోయే ప్రతిఫలం గురించి చెప్పాడు. అప్పుడు వాళ్లు సంతోషంగా ఒప్పుకొన్నారు.

రాత్రి పిల్లలిద్దరికీ ఫోన్ చేసి విషయం చెప్పాడు.

''అల్టిమేట్‌గా నీవు సంతోషంగా ఉండటమే మాకు కావాల్సింది నాన్నా!'' అని ఒకేరకంగా చెప్పారు వాళ్లు.

మరుసటి ఉదయమే ఆటో రాజును పిలిచి, ఊళ్లోని తన క్లాస్‌మేట్స్‌తోపాటు మిగతా వృద్ధులందరినీ.. ఆడా మగా తేడాలేకుండా, మధ్యాహ్న భోజనానికి రమ్మని చెప్పి పంపించాడు గోవిందం. అది దావత్ కాదనీ, రోజూ తినే మామూలు భోజనమేననీ చెప్పమన్నాడు.

ఆ మధ్యాహ్నానికి ముప్పైమంది వృద్ధుల దాకా వచ్చారు. అన్నం, ఒక కూర, చారు, పెరుగుకు అదనంగా ఒక గుడ్డును వడ్డించారు. అందరూ ఇష్టంగా తిని సరదాగా కబుర్లు చెప్పుకోసాగారు.

''ఇదే రకమైన సింపుల్ భోజనం ప్రతిరోజూ మన మందరం ఇట్లనే కలిసి తినాలని నా కోరిక. మరి మీరు వొస్తరా?'' అని అడిగాడు గోవిందం.

''ఇల్లమ్ముకొని పోదమని వొచ్చినోనివి. ఈడెట్లుంటవు గోవిందూ!?'' ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్‌రెడ్డి.

''అట్లనుకొనే వొచ్చిన! కానీ, మొన్న మనం దావత్ చేసుకున్నంక.. నా ఆలోచన మారింది. ఇల్లును ఇప్పుడే అమ్మను. నాకు చాతనైనన్ని రోజులు మీతోనే.. ఇక్కడే కల్సి ఉండమని అనుకుంటున్న. ఓల్డేజ్ హోమ్‌లో నాకెంతో హాయిగ ఉంటది. కానీ, మీతో ఇట్లుంటే మాత్రం ఆనందంగ ఉంటున్న. ఆ ఓల్డేజ్ హోమ్‌ల నెలకు నేను కట్టే ఇరవై ఐదు వేలతోనే.. మనం ముప్పై మందిమి ఒకపూట మంచిగ తింటున్నం. సంతోషంగ ఉంటున్నం. అంతకన్నా ఏం కావాలి నాకు. అందుకే, మీరేమీ మొహమాట పడకుండా.. 'మా గోవిందుగాడి ఇంటికి పోతున్నం!' అని అనుకొని రాండ్రి. ఎందుకంటే నేను ఓల్డేజ్ హోమ్‌కు ఇచ్చే పైసల్నే మనందరి కోసం ఖర్చుపెడుతున్న'' అన్నాడు గోవిందం చిరునవ్వుతో నమస్కరిస్తూ.

''నీవెందుకురా మాకు మొక్కుతున్నవు. నీ గొప్ప మనసుకు మేమందరం నీకు మొక్కాలె!'' అన్నాడు యాదయ్య.

''అవునవును!'' అని ముక్తకంఠంతో గట్టిగా అంటున్న వారి కళ్లలో.. సంతోషకరమైన ఓ చిన్న వెలుగు రేఖ మెరిసింది.

ఎంత చిన్నదైనా.. వెలుగు వెలుగే కదా! ■

## గంగుల నరసింహారెడ్డి



గంగుల నరసింహారెడ్డి స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా వెదిరేపల్లి. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. బీఎస్సీ చదివారు. ఎస్‌బీఐలో ఉద్యోగం చేసి, పదవీ విరమణ పొందారు. 1980 నుంచి కథలు రాస్తున్నారు. ఇప్పటివరకూ 3 నవలలు, 80కి పైగా కథలు రాశారు. వీటిలో రెండు నవలలు, 25 కథలకు వివిధ సాహితీ సంస్థలు, పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో బహుమతులు దక్కాయి. 1993లో ఆంధ్రప్రభ వార పత్రిక కథల పోటీలో ఈయన రాసిన 'వాన కురిసింది' కథ ప్రథమ బహుమతి పొందడంతోపాటు రచయితగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. 'ఉత్తమ తెలుగు వాన కథలు' అనే సంపుటిలోనూ ఈ కథ స్థానం దక్కించుకున్నది. 2019లో నిర్వహించిన నమస్తే తెలంగాణ – ముల్కనూరు గ్రంథాలయం కథల పోటీలో 'ఒడిబియ్యం' కథకు బహుమతి అందుకున్నారు. స్వగ్రామంలో కొందరు తన తోటివారి దయనీయ పరిస్థితులను చూసి ప్రస్తుత కథ.. 'శిథిల సంధ్యలో చిరుదీపం' రాసినట్లు రచయిత చెబుతున్నారు.